క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



శ్రీరాంకాలనీలో ఫాగింగ్

పహాడీషరీఫ్: వర్షాకాలం నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపల్ అధికారులు దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. విషజ్వరాలు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచిస్తూనే.. బస్తీలలో ఫాగింగ్, ఇళ్లల్లోని నీటి సంప్‌లలో టెమోఫాస్ పిచికారీ చేయిస్తున్నారు. శ్రీరాం కాలనీలోని రిలయన్స్ ఏరియాలో స్థానిక బీజేపీ నాయకుడు షేర్‌సింగ్ యోగి ఫాగింగ్ చేయించాడు.

ఉచిత గుండె వైద్య శిబిరం



వైద్యులతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐ.రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కందుకూరుకు చెందిన రాఘవేంద్ర ఆస్పత్రికి చెందిన వైద్యుల బృందం హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు గంగుల ప్రభాకర్‌రెడ్డి, బి.శ్రీనివాస్, నాయకులు ఎ.కుమార్, ఎండీ సలావుద్దీన్, అంకగళ్ల దర్శన్, బొర్రా సురేష్, గడిగ రాములు, డి.రాములు, కె.యాదగిరి, వి.వెంకటేశ్, ఏ.సుధాకర్, సాయిబాబా, ప్రవీణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పట్టణంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దర్పల్లి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారి పలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో వివిధ వేషధారణలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, స్థానిక నాయకులు, బస్తీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతి



ఈస్ట్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. ఈ మేరకు మంగళవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని, 30ఏళ్ల నాటి భూగర్భ డ్రైనేజీని పునర్నిర్మించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. సకాలంలో పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

మన్సూరాబాద్: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వేణుమాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్..

- ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మంజూరుకు సన్నాహాలు
- కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు 33,373 మంది
- ఇప్పటి వరకు మంజూరైనవి 3,400
- శరవేగంగా దరఖాస్తుల పరిశీలన



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో పేదలకు త్వరలోనే రేషన్ కార్డులు అందనున్నాయి. గత కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి ఈ నెలలోనే కొత్త కార్డులు మంజూరు కానున్నాయి. 2014–2024 వరకు కార్డులు మంజూరు కాకపోవడంతో ప్రజలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ సేవలకు రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో నిమ్స్ తదితర ఆసుపత్రుల్లో వైద్య సేలు అందక అవస్థలు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టడంతో పెద్ద సంఖ్యలో పలువురు ప్రజాపాలనలో దరఖాస్తులను అందజేశారు. అయితే రెండేళ్లు గడిచినా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టి లో ఉంచుకుని ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరును వేగవంతం చేయాలని ఆదేశించడంతో కార్డుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. పదిరోజుల్ల కార్డుల పరిశీలన పూర్తి చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేశారు.

ఎల్‌బీనగర్ నియోజకవర్గం 11 డివిజన్లతో పాటు మహేశ్వరంలోని రెండు డివిజన్లతో కలిపి కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సర్వే జరుగుతోం. రేషన్ కార్డుల కోసం దాదాపు 37,373 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇప్పటి వరకు సుమారు 3400 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. గత పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. వేల సంఖ్యలో దరఖాస్తులు అందినా సివిల్ సప్లయ్ శాఖ వద్ద సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారులకు ఆశలు చిగురించాయి. లబ్ధిదారులను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు అదనపు సిబ్బందిని నియమించి సర్వేను ముమ్మరం చేశారు.

పది రోజుల్లో సర్వే పూర్తి



కొత్త రేషన్ కార్డుల మంజూరు చేసేందుకు చేపట్టిన సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నాం. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేజేస్తాం. పాత రేషన్ కార్డుల్లో లేని పేర్లను ఇప్పుడు చేర్చేందుకు, లేని వారి పేర్లను తొలగించేందుకు మీ సేవా ద్వారా మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పుల్లయ్య, ఏఎస్ఓ, సరూర్‌నగర్

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ఆలయంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం మొదటి మంగళవారం, అందులో నాగులపంచమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం, ఆలయ ఎదుట ఉన్న పుట్టలో పాలు పోసి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. ఆలయంలో సామూహిక వ్రతాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్ రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్

ఆలయానికి భక్తులు భారీగా రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రావిర్యాల నుంచి ఆలయం వరకు, ఆలయం నుంచి సర్దార్‌నగర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఆలయానికి వెళ్లడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిలో మీటర్ దూరంలో వాహనాలను నిలిపి నడిచి వెళ్లారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థి దశలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ సోమనాథ్, నారాయణ స్కూల్ ఏజీఎం హేమంబర్ అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మార్కెట్ కమిటీ డైరెక్టర్ అండేకార్ సురేందర్

కందుకూరు: సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అండేకార్ సురేందర్, మాజీ ఉపసర్పంచ్‌లు గొరిగె రాజు, ఎడ్ల రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకులమైలారం గ్రామానికి చెందిన చిర్ర మమతకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.37,500ల చెక్కును మంగళవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ చొరవతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆయనకు లబ్ధిదారుల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గౌర శ్రీశైలం, రావుల సురేష్, గుర్రం బాబు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి చెక్కు అందిస్తున్న నాయకులు

నేను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదు

బీజేపీ నేత రాజశేఖర్‌రెడ్డి

పహాడీషరీఫ్: తాను రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి డబ్బులు డిమాండ్ చేశానంటూ మామిడిపల్లి మాజీ కార్పొరేటర్లు చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్‌కుమార్ యాదవ్‌లు చేసిన ఆరోపణల నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డి మంగళవారం గ్రామంలోని దాసాంజనేయస్వామి విగ్రహంపై ప్రమాణం చేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకులను తాను నిజంగానే డబ్బులు డిమాండ్ చేసినట్లయితే మా కుటుంబం ఇబ్బందులకు గురవుతుందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేస్తున్నానే.. తప్పా మరేది ఆశించి కాదన్నారు. మీర్‌పేట్‌లో కార్పొరేటర్‌గా పనిచేసిన తన భార్య మద్ది సబితను అడ్డు పెట్టుకొని బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాననడం దుర్మార్గమన్నారు. తనపై ఆరోపణలు చేసిన మాజీ కార్పొరేటర్లపై పరువు నష్టం దావా వేస్తానని పేర్కొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహంపై ప్రమాణం చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

అంతర్గత రహదారుల నిర్మాణానికి చర్యలు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె సంజీవయ్యనగర్‌లో రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బస్తీ వాసులు శంకర్, ప్రభాకర్, భూషణం, ఇలియాస్, దౌలత్‌ఖాన్, బీజేపీ నాయకులు దేవేందర్, రాజేష్, పరశురామ్, సంతోష్, పాల్గొన్నారు.

జల్‌పల్లి ప్రత్యేకాధికారిగా వెంకట్‌నారాయణ



పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా మెప్మా పీడీ జి.వెంకట్‌నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వర్షాకాలం దృష్ట్యా విషజ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

బడుగుల సంక్షేమానికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి

కందుకూరు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మూల హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వకపోగా, పది లక్షలకుపైగా పాత కార్డులను రద్దు చేసి పేదలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు నిసిగ్గుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆరు లక్షలకుపైగా తమ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు ఇచ్చామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులను నిరంతరం జారీ చేయనుందన్నారు. పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మీ తదితర పథకాలను అమలు చేస్తున్న చరిత్ర కాంగ్రెస్‌కే దుక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సభావత్ గణేష్‌నాయక్, ఎగ్గిడి కృష్ణ, ఉండేల బాబురావు, గోపిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గూడూరు మధూకర్ రెడ్డి, మహేందర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.